కంకర రోడ్లపై ప్రయాణించేదెలా?

- అవస్థలు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు


అధ్వానంగా వెంకట్‌రావ్‌పేట రోడ్డు

అల్లాదుర్గం(మెదక్): గ్రామీణ ప్రాంత రోడ్లు అధ్వానంగా మారి, నరకానికి దారులుగా మారుతున్నాయి. నిత్యం ప్రయాణికులు రోడ్లపై నరకం చూస్తున్నారు. ఏళ్ల తరబడి రోడ్లు దారుణంగా మారినా.. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. అత్యవసర పరిస్థితిలో అంబులెన్సులు గ్రామాలకు వెళ్లలేక ప్రజల ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు ఉన్నాయి. అడుగడుగున గుంతల మయంగా మారి, కంకర తేలడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అల్లాదుర్గం మండలంలో గ్రామీణా రోడ్లు దారుణంగా ఉన్నాయి. అల్లాదుర్గం, వెంకట్‌రావ్‌పేట మీదుగా జగిర్యాల రోడ్డు వరకు, గడిపెద్దాపూర్ నుంచి పాతులబోగుడ, అల్లాదుర్గం నుంచి చేవెళ్ల వెళ్లే రోడ్లు దారుణంగా మారాయి. అప్పాజీపల్లి నుంచి టేక్మాల్ మండలం తంపూలూర్ రోడ్డు పూర్తిగా పాడైపోయింది. వెంకట్‌రావ్‌పేట నుంచి రేగోడ్, నారాయణఖేడ్ వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. వెంకట్‌రావ్‌పేట నుంచి జగిర్యాల వరకు రెండున్నర కిలోమీటర్ల రోడ్డు బీటీ లేచి కంకర తేలి గుంతలమయంగా మారింది. ఇదే రోడ్డు వెంకట్‌రావ్‌పేటలో సిమెంట్ రోడ్డు పగిలిపోయి ప్రమాదకరంగా మారింది. అడుగడుగునా కంకర తెలడం, సిమెంట్ రోడ్డు పగిలిపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతూ, దివ్యాంగులుగా మారుతున్నారు. అల్లాదుర్గం నుంచి చేవెళ్ల వెళ్లే రోడ్డుపై నుంచి ఆటోలు వెళ్లలేక ఆరు కిలోమీటర్లు దూరం ఎక్కువైన చిల్వెర ఐబీ చౌరస్తా నుంచి అల్లాదుర్గం వెళ్లాల్సి వస్తుందని డ్రైవర్లు చెబుతున్నారు.


కంకర తేలిన అల్లాదుర్గం - చేవెళ్ల రోడ్డు

అల్లాదుర్గం నుంచి రేణుకా ఎల్లమ్మ ఆలయానికి వెళ్లేందుకు కిలో మీటర్ దూరమే ఉంది. ఈ రోడ్డు కంకర తేలి ప్రమాదకరంగా మారింది. ఈ ఆలయానికి కర్నాటక, మహారాష్ట్ర, ఇతర ప్రాంతాలకు చెందిన భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. 161 రహదారి నుంచి ముప్పారం వెళ్లే మూడు కిలోమీటర్ల రోడ్డు, అల్లాదుర్గం నుంచి అప్పాజీపల్లి, అప్పాజీపల్లి నుంచి తంపూలుర్, రాంపూర్ చౌరస్తా నుంచి సీతానగర్ మీదుగా తండా రోడ్డు గతంలో బీటీ రోడ్డు వేశారు. ఈ రోడ్లపై బీటీ లెచిపోయి మట్టి రోడ్లు కంకర తేలి గుంతలమయంగా మారాయి. అధికారులు స్పందించి రోడ్లు బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

దూరం పెరిగింది



రోడ్డు అధ్వాన్నంగా మారడంతో దూరం పెరిగింది. అల్లాదుర్గం వెళ్లాలంటే రెండున్నర కిలోమీటర్లే. చెవెళ్ల నుంచి అల్లాదుర్గం వెళ్లే బీటీ రోడ్డు పాడైపోయి గుంతల మయంగా మారింది. దీంతో చేవెళ్ల నుంచి బహిరన్‌దిబ్బ మీదుగా ఐబీ చౌరస్తా నుంచి అల్లాదుర్గం వెళ్లడంతో ఆరు కిలోమీటర్లు పడుతుంది.

– నవీన్, చేవెళ్ల

నిత్యం ప్రమాదాలే..



గ్రామాల రోడ్లు పూర్తిగా పాడైపోయాయి. ఏళ్ల తరబడి ఎలాంటి మరమ్మతులు చేయడం లేదు. గుంతల మయంగా మారిన రోడ్లపై వాహనాలు నడపలేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆటో డ్రైవర్లు నడపాలంటే నరకం చూడాల్సి వస్తుంది.

– భూమయ్య, ఆటో డ్రైవర్

రజతోత్సవ సభకు బీఆర్‌ఎస్ శ్రేణులు

వరంగల్‌లో తలపెట్టిన బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు జిల్లా వ్యాప్తంగా ఆదివారం భారీగా బీఆర్‌ఎస్ శ్రేణులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా అన్ని గ్రామాల్లో పార్టీ జెండాలు ఆవిష్కరించారు.


శివ్వంపేట(నర్సాపూర్): మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు


పాపన్నపేట(మెదక్): పాపన్నపేట నుంచి తరలి వెళ్లిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు


మనోహరాబాద్(తూప్రాన్): కూచారంలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద జెండా ఆవిష్కరణ

ప్రజలను కలిచివేసిన పహల్గాం ఘటన

నర్సాపూర్: జమ్ము కాశ్మీర్‌లోని పహల్గాం కాల్పుల ఘటన దేశంలోని ప్రజల హృదయాలను కలిచి వేసిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్ అన్నారు. ఆదివారం మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మాట్లాడారన్నారు. పర్యాటకులపై కాల్పులు జరిపిన ఘటనతో సంబంధం ఉన్న వారికి భారత దేశం తగిన బుద్ధి చెప్తుందని, అలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని ప్రధాని చెప్పారని వారు తెలిపారు. వారి వెంట పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పరామర్శ


టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి సంతాపం

కౌడిపల్లి(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తండ్రి, కొడుకుల అంత్యక్రియలు ఆదివారం అశ్రునయనాల మధ్య జరిగాయి. మండలంలోని వెంకట్రావ్‌పేట గ్రామానికి చెందిన మాల గోపాల్, అతని కొడుకు అనుదీప్, బంధువు సహస్ర చిన్నచింతకుంట సమీపంలో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా భార్య పూజ, కూతురికి గాయాలైన విషయం విధితమే. కాగా ఆదివారం మృతులకు పోస్ట్ మార్టం అనంతరం మాల గోపాల్, అనుదీప్ అంత్యక్రియలు వెంకట్రావ్‌పేటలో జరిగాయి. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆజనేయులుగౌడ్‌తో పాటు పలువురు నాయకులు పరామర్శించి సంతాపం తెలిపారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

టేక్మాల్(మెదక్): మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో ఆదివారం జరిగిన ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ప్రిన్సిపాల్ సాయిలు తెలిపారు. 6వ తరగతి ప్రవేశ పరీక్షకు 146 మంది, 7వ తరగతికి 38, 8వ తరగతికి 30, 9వ తరగతికి 15, 10వ తరగతికి 5 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు ఆయన తెలిపారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్ ప్రవేశ పరీక్షలు ప్రశాంతగా ముగిసినట్లు ప్రిన్సిపాల్ వాణి కుమారి తెలిపారు. ఆదివారం మోడల్‌స్కూల్‌లో నిర్వహించిన ప్రవేశ పరీక్షలో 6వ తరగతి ప్రవేశం కోసం 200 మంది విద్యార్థులు, 7వ తరగతికి 54, 8వ తరగతికి 42, 9వ తరగతికి 30, 10వ తరగతికి 6 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హాజరనట్లు తెలిపారు.


టేక్మాల్‌లో పరీక్షా కేంద్రం వద్ద హాల్ టికెట్లు చూసుకుంటున్న విద్యార్థులు

బస్సును రివర్స్‌లో ఢీకొన్న లారీ

రామాయంపేట(మెదక్): సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ శ్రేణులు ఆదివారం చలో ఎల్కతుర్తి తరలి వెళ్తుండగా, వారు ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సును రామాయంపేట వద్ద రివర్స్‌లో వెనకకు వచ్చిన లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు కాని సంగారెడ్డి డిపోకు చెందిన బస్సు అద్దాలు పగిలాయి. రామాయంపేటలోని సిద్దిపేట చౌరస్తా మలుపు వద్ద ముందు వెళ్తున్న రివర్స్ తీసుకోగా, వెనకనే ఉన్న బస్సును తాకి, బస్సు అద్దాలు పగిలాయి. దీంతో బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు కొందరు బస్సులు దిగి లారీ డ్రైవర్‌పై చేయి చేసుకొని సెల్‌ఫోన్, లారీ తాళాలు లాక్కున్నారు. ఎస్‌ఐ బాల్‌రాజ్ వారిని సముదాయించి పంపించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.


రోడ్డుపై బీఆర్‌ఎస్ కార్యకర్తలు

మూఢనమ్మకాలపై పోలీసుల కళాజాత

పెద్దశంకరంపేట(మెదక్): మూఢనమ్మకాలపై పోలీసుల ఆధ్వర్యంలో పెద్దశంకరంపేటలోని ఎస్సీ కాలనీలో ఆదివారం కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ.శంకర్ మాట్లాడుతూ.. మూఢనమ్మకాలను నమ్మవద్దని, ప్రజలందరూ కులమతాలకు అతీతంగా కలిసిమెలిసి ఉండాలని, శాంతిభద్రతలకు సహకరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు సీహెచ్.సురేందర్, ఎస్‌బీ రాములు, రాజునాయక్, రమేష్ తదితరులున్నారు.


మాట్లాడుతున్న ఎస్‌ఐ.శంకర్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


నార్సింగి జెడ్పీపాఠశాలలో గురువులతో పూర్వ విద్యార్థులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్న ఉన్నత పాఠశాలలో 2002-03 ఎస్‌ఎస్‌సీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులను సన్మానించారు.

నార్సింగి జెడ్పీపాఠశాలలో..

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి జెడ్పీపాఠశాల 2002-2003 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు చదువు చెప్పిన గురువులను సత్కరించారు.

చందంపేటలో..

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని చందంపేట జెడ్పీపాఠశాల 2006-07లో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన గురువులను పూర్వ ఉపాధ్యాయులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రమ్యశ్రీ, రేణుక, చైతన్య, అమరావతి,మమత, రవి, వినయ్, నరేష శ్రీకాంత్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.


మనోహరాబాద్‌లో కలిసిన పూర్వ విద్యార్థులు


చిన్నశంకరంపేట(మెదక్): చందంపేట జెడ్పీపాఠశాలలో...


కౌడిపల్లి(నర్సాపూర్): వెల్మకన్నలో పూర్వ విద్యార్థులు

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 2006-07లో చదివిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తాము చదివిన పాఠశాల, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితర విషయాలపై చర్చికున్నారు. ఈ సందర్భంగా కలుసుకోవడం ఆనందంగా ఉందని పూర్వ విద్యార్థులు తెలిపారు.

బగలాముఖీ శక్తిపీఠంలో హరిద్వార్చన

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన బగలాముఖీ శక్తిపీఠంలో ఆదివారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. బగలాముఖీ ఉపాసకుడు, వేద పండితుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో మహామంత్ర హవనం, హరిద్వార్చన, విశేష పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు కమలేశ్, తదితరులు ఉన్నారు.

హనుమాన్ ఆలయంలో ..

నర్సాపూర్: నర్సాపూర్‌లోని బస్టాండ్ హనుమాన్ ఆలయంలో ఆదివారం అమావాస్యను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదం, అన్న ప్రసాదం అందజేశారు. ప్రతీ నెల అమావాస్య రోజు ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు చెప్పారు.

నల్లపోచమ్మదేవి ఆలయంలో..

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి గ్రామ సమీపంలోని నల్లపోచమ్మదేవి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. దేవాదాయశాఖ ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌స్పెక్టర్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శివ్వప్ప, రాజేశ్, విఘ్నేష్ నల్ల పోచమ్మదేవికి పంచామృతాలతో అభిషేకం చేసి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు బోనాలు సమర్పించి ఒడిబియ్యం పోసి కుంకుమార్చన చేసి మొక్కులు తీర్చుకున్నారు. దీంతోపాటు పలువురు భక్తులు అమ్మవారికి తలనీలాలు సమర్పించి వాహనాలకు పూజలు చేయించారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, ఆలయ సిబ్బంది భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

చాముండేశ్వరి ఆలయంలో..

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించామని ఆలయ అర్చకులు తెలిపారు. మండలంలోని చిట్కుల్ శివారులో మంజీరా తీరాన వెలసిన చాముండేశ్వరి అమ్మవారి దర్శనానికి భక్తులు తరలి వచ్చారు. అనంతరం అమ్మవారికి కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు.


శివ్వంపేట(నర్సాపూర్): బగలాముఖీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు


కౌడిపల్లి(నర్సాపూర్): తునికి నల్లపోచమ్మ పూజల్లో పాల్గొన్న భక్తులు

ఎంపీడీఓ కార్యాలయంలో లోపించిన పరిశుభ్రత

ఫైళ్లను ఎక్కబడితే అక్కడ పడేసిన అధికారులు

హవేళిఘణాపూర్(మెదక్): గ్రామాల్లోని రోడ్లు, మురుగునీటి కాల్వలు పరిశుభ్రంగా ఉండాలని చెప్పే మండలాభివృద్ధి కార్యాలయంలో మాత్రం పరిశుభ్రత లోపించింది. ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది ఫైళ్లను ఎక్కడబడితే అక్కడ పారవేయడంతో కార్యాలయంలో చెత్త చెదారంగా మారింది. దీంతో గతంలో పంపిణీ చేసిన బతుకమ్మచీరలు, ఇతర పత్రాలను సరిగ్గా భద్రపర్చకుండా ఇలా పారవేయడంతో పరిశుభ్రత లోపించి కార్యాలయానికి వచ్చిన ప్రజలను దీనిని చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. మండల అభివృద్ధి కార్యాలయంలో నిర్వహణ ఇలా ఉంటే మండల గ్రామాల పరిశుభ్రతపై అధికారులు ఎలా పర్యవేక్షిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.


ఎంపీడీఓ కార్యాలయంలో పడేసిన ఫైళ్లు

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

చేగుంట(తూప్రాన్): మండలంలోని రాంపూర్ గ్రామంలో ఆదివారం ధాన్యం కొనుగోలును ప్రారంభించారు. ఈ సందర్భంగా తహ్శీల్దార్ శ్రీకాంత్ మాట్లాడుతూ ధాన్యం తూకం వేసి లోడింగ్ కోసం కూలీల కొరత ఏర్పడిందని తెలిపారు. అన్ని గ్రామాల్లో హమాలీలతో చర్చించి ధాన్యం త్వరగా తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన మేరకు ధాన్యం తరలించేందుకు స్థానిక హమాలీలు ముందుకొస్తే ధాన్యం త్వరగా తరలించే వీలు కలుగుతుందన్నారు. నాయకులు ఐకేపీ సిబ్బంది ఉన్నారు.


రాంపూర్ గ్రామంలో ధాన్యం తూకం వేస్తున్న కూలీలు

రోడ్డు నిర్మాణానికి తొలగిన అడ్డంకులు

విద్యుత్ వైర్లను తొలగించిన అధికారులు

హవేళిఘణాపూర్(మెదక్): ఎనిమిది నెలలుగా విద్యుత్, ఆర్అండ్‌బీ అధికారుల సమన్వయ లోపంతో మండల కేంద్రంలో రోడ్డు నిర్మాణం సాఫీగా సాగలేదు. దీంతో మండల కేంద్రంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాదారులు, ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయంపై సాక్షిలో కథనాలు ప్రచురించిన విషయం తెల్సిందే. ఆదివారం విద్యుత్‌శాఖ అధికారులు పాత స్తంభాలను తొలగించి, వాటిని కొత్త స్తంభాలకు కనెక్షన్లు ఇచ్చారు. దీంతో రోడ్డు నిర్మాణ పనులు సాఫీగా సాగనున్నాయి. అధికారులు వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రజల ఇబ్బందులు తీర్చాలని కోరుతున్నారు.


విద్యుత్ వైర్లను సరి చేస్తున్న అధికారులు

దాతల సహాయం వెలకట్టలేనిది

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న దాతల సహాయం వెలకట్టలేనిదని బీఆర్‌ఎస్ నాయకుడు కృష్ణారావు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఉసిరికిపల్లి ప్రాథమిక పాఠశాల అభివృద్ధి కోసం జీఎంఆర్ సంస్థ ముందుకు రావడంపై సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనతో పాటు పలు సామగ్రి, స్టడీ మెటీరియల్ అందజేయడంపై విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు.

క్లుప్తంగా

సోలార్ లైట్లు ఏర్పాటు


ఆదినారాయణ స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సోలార్ లైట్లు

నర్సాపూర్: ఎంపీ లాడ్స్ నుంచి నిధులు మంజూరు చేసి, సోలార్ లైట్లు ఏర్పాటు చేసేందుకు మెదక్ ఎంపీ రఘునందన్‌రావు చర్యలు తీసుకున్నారని స్థానిక బీజేపీ నాయకులు మహేందర్‌గౌడ్, రాజు తదితరులు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలు ఆలయాల వద్ద లైట్లు లేక చీకటిగా ఉంటుందని తమ పార్టీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్ ఎంపీ దృష్టికి తీసుకుపోయారని, ఎంపీ స్పందించి నిధులు మంజూరు చేశారని వారు చెప్పారు. ఎంపీ నిధులతో సోలార్ లైట్లు తెచ్చి పట్టణంలోని కాలువ గట్టు హనుమాన్ ఆలయం, ఆదిలక్ష్మీనారాయణ స్వామి ఆలయాల వద్ద ఏర్పాటు చేశామని చెప్పారు.

మండలానికి 285 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు


వివరాలు సేకరిస్తున్న ఎంపీడీఓ

వెల్దుర్తి(తూప్రాన్): ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద వెల్దుర్తి మండలానికి 285 ఇళ్లు మంజూరయ్యాయని ఎంపీడీఓ ఉమాదేవి తెలిపారు. అదేవిధంగా మండలంలో పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసిన ధర్మారం గ్రామానికి 112 ఇళ్లు మంజూరు కాగా అందులో కొన్ని నిర్మాణాలు కొనసాగుతున్నాయన్నారు. అర్హుల ఎంపిక పారదర్శకంగా చేపట్టేందుకు మండలంలోని అన్ని గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరిస్తున్నామన్నారు. మొదటి విడతగా ఇంటి స్థలం ఉండి పూరిగుడిసెలో నివసిస్తున్న వారికి, కిరాయి ఉంటున్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీల చేత లబ్ధిదారులను ఎంపికచేస్తామన్నారు.

ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా లింగం


చేగుంట ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

చేగుంట(తూప్రాన్): మండలం కేంద్రం చేగుంటలోని ముదిరాజ్ సంఘం ఎన్నికలను ఆదివారం నిర్వహించారు. గ్రామ సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడిగా తలారి లింగంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా తుంపల రాజు, ప్రధాన కార్యదర్శిగా చింతాల సిద్ధి రాములు, కోశాధికారిగా ప్రశాంత్, సహాయ కార్యదర్శిగా వెంకటేశ్ గౌరవ సభ్యులుగా 20 మంది సంఘం నాయకులను ఎన్నుకున్నారు. అనంతరం సంఘం అభివృద్ధి విషయంలో చర్చించి తీర్మానాలు చేశారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టివేత

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని శివ్వాయిపల్లి గ్రామ శివారులోని వాగులో నుంచి అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు, ఒక జేసీబీని పట్టుకున్నట్లు మెదక్‌రూరల్ ఎఎస్‌ఐ వెంకటయ్య ఆదివారం తెలిపారు. శివ్వాయిపల్లి వాగులో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న విషయం తెలుసుకొని వెళ్లి సందర్శించగా అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లు, జేసీబీని పట్టుకొని, కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

మన్ కీ బాత్‌లో పాల్గొన్న బీజేపీ నాయకులు


మన్ కీ బాత్‌ను వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం నిర్వహించిన మన్ కీ బాత్ కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు పాల్గొని వీక్షించారు. కాశ్మీర్‌లో పర్యటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడికి నిరసనగా బీజేపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. మన్ కీ బాత్‌లో ప్రధాని చెప్పిన విషయాలను ఈ సందర్భంగా నేతలు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొండల్‌రావు, మండలాధ్యక్షుడు రవి, నాయకులు అశోక్, భాస్కర్, వినోద్, శేఖర్, తదితరులు ఉన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. లక్ష్మణ్
9502735264